సాక్షి
సిద్దిపేట
ఆదివారం ౹ 29 ౹ జనవరి ౹ 2023



కారు టైరు మారుస్తుండగా..

కారు టైరు మారుస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 8లో..



రైతును వేధిస్తున్న 'మొగిపురుగు'

వరి పైరుకు సోకుతున్న మొగి పురుగుతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గుర్తించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో..



ప్రయాణికులకు వసతులు కరువు

దుబ్బాక పట్టణంలో సుమారు రూ. 4 కోట్ల నిధులతో మోడల్ బస్టాండ్‌ను నిర్మించారు. కానీ ప్రయాణికులకు కల్పించాల్సిన మౌలిక వసతులను పూర్తిగా విస్మరించారు. 9లో..

న్యూస్‌రీల్

రాజీయే రాజమర్గం



మాట్లాడుతున్న న్యాయమూర్తులు రఘురాం, స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం అన్నారు. శనివారం సిద్దిపేట కోర్టు ఆవరణలో న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నేర రహిత గ్రామాలను గుర్తించాలని పోలీస్ అధికారులకు సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి , లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ తగాదాలతో కొన్ని సివిల్ కేసులు.. ఆతర్వాత క్రిమినల్ కేసులుగా రూపాంతరం చెంది కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. అలాంటి కేసులను గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా రాజీచేసి పరిష్కరించే దిశగా పోలీస్ శాఖ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూశాఖ ఏట రహమాన్, సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, లీగల్ సర్వీస్ అథారిటీ సూపరింటెండెంట్ మధసూదన్‌రెడ్డి, జిల్లా కోర్టు పీపీ వెంకటలింగం, సిరికొండ మణి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సిద్దిపేటరూరల్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా మోటార్ సైకిళ్లను అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

రాష్ట్ర మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి షఫీవుల్లా



పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న షఫీవుల్లా

దుబ్బాక: మైనార్టీ గురుకులాల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన విద్యతో పాటు ఉచిత వసతులు అందించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్టు రాష్ట్ర మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి షఫీవుల్లా అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలో గల మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో తరగతి గదులు, వసతి గృహం, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని కొనియాడారు. రానున్న పది, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మైనార్టీ ముఖ్య విజిలెన్స్ అధికారి గౌసొద్దీన్, మైనార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా సమన్వయ కర్త నర్సింహా, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి గోపాల్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ విమలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉప'యోగా'లెన్నో..



సూర్య నమస్కారాలు చేస్తున్న పట్టణ వాసులు





మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



రథసప్తమి సందర్భంగా కోమటి చెరువుపై వ్యాస మహర్షి యోగా సొసైటీ, జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్తంగా సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించాయి. ఈసందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కరోనాను ఎదుర్కోవడంలో యోగా, ప్రాణయామం ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణశర్మ, వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరాం, తదితరులు పాల్గొన్నారు. - సిద్దిపేటజోన్

నేడే మల్లన్న లష్కర్ వారం

భారీగా తరలివస్తున్న భక్తులు ◆ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. నేడు లష్కర్ వారం కావడంతో శనివారం సాయంత్రమే క్షేత్రానికి చేరుకుని దూళి దర్శనం చేసుకున్నారు. నేడు మల్లన్నకు పట్నం వేసి, బోనం సమర్పించడంతో పాటు అమ్మవార్లకు ఒడి బియ్యం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటారు. లష్కర్‌వారం సందర్భంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

లష్కర్‌వారంలో సికింద్రాబాద్ భక్తులు

మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి వారం పట్నం వారం హైదరాబాద్ భక్తులు సందడి చేయగా.. రెండో వారం లష్కర్‌వారం సందర్భంగా సికింద్రాబాద్ భక్తులు సందడి చేయనున్నారు. స్వామి వారి దర్శనంతో పాటు కొండపైన గల రేణుక ఎల్లమ్మకు బోనాలు, పట్నాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. లష్కర్ వారానికి సుమారు 60 వేల మంది భక్తులు వస్తారని ఆలయ వర్గాల అంచనా.

కొమురవెల్లికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు జనగామ, హైదరాబాద్, సికింద్రాబాద్, హన్మకొండ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, మెట్‌పల్లి నుంచి వాహనాలలో వచ్చే భక్తులు సిద్దిపేట కమాన్ నుంచి మల్లన్న చెరువు వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడే వాహనాలను నిలిపి ఆలయానికి చేరుకోవచ్చు. జనగామ, వరంగల్, నల్లగొండ నుంచి వచ్చే భక్తులకు బస్టాండ్ సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.



స్వామి వారి మూల విరాట్

ప్రణాళికతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

దుబ్బాకటౌన్: యువత జీవన నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసంతో ముందుకు సాగాలని జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం నెహ్రూ కేంద్ర సిద్దిపేట యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో లచ్చపేట మోడల్ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇష్టపడి ప్రణాళిక ప్రకారం చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చని పేర్కొన్నారు.



రంజిత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుప్రియ

బీజేపీని గద్దె దించుతాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కేంద్రంలో పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఐక్య ఉద్యమాలతో గద్దె దించుతామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో సీపీఐ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాతో పనిచేస్తున్న ప్రధాని మోడీ దేశంలో గవర్నర్ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు కేటాయించాలన్నారు. రైతులకు గుదిబండగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు పేదలకు చేరాలనే లక్ష్యంతో వామపక్ష, ప్రగతిశీల, కమ్యూనిస్టు పార్టీలు సంఘటితంగా పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామగల్ల నరేశ్, జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకలు లక్ష్మణ్, భిక్షపతి, కృష్ణ, మల్లేశం, నర్సింలు, చంద్రం, సంపత్, రాజు, కానుగుల భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

తెలంగాణలో అభివృద్ధి భేష్



గజ్వేల్ కూరగాయల మార్కెట్‌ను సందర్శిస్తున్న ఒడిషా రైతు బృందం

గజ్వేల్‌రూరల్/ మర్కూక్(గజ్వేల్): తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయని ఒడిషా రైతుసంఘం నేత దేవీప్రసాద్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ మార్కెట్‌తో పాటు కోమటిబండగుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ హెడ్ రెగ్యులేటరీని ఒడిషాకు చెందిన సుమారు 130 మంది రైతు సంఘం ప్రతినిధులు సందర్శించారు. ఈసందర్భంగా 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ వివరించారు. అనంతరం దేవీప్రసాద్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కేసీఆర్ సూచనల మేరకు వచ్చామని తెలిపారు. ఇక్కడ నిర్మించిన మార్కెట్‌ను తాము ఎక్కడా చూడలేదని, కొనియాడారు. అదేవిధంగా ఇంటింటికీ తాగు నీటిని అందించే మిషన్ భగీరథ పథకం అద్భుతమని కొనియాడారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ సెక్రటరీ జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, ఒరిస్సా రైతు ప్రతినిధుల బృందం సభ్యులు ఉన్నారు. అనంతరం సీఎం దత్తత గ్రామమైన ఎర్రవల్లి రైతు వేదికను సందర్శించారు. రైతులకు కావాల్సిన సమాచారం భవనంలో ఉండడం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

సంపూర్ణమైన ఆరోగ్యమే నిజమైన ప్రగతి



సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సంపూర్ణ ఆరోగ్యమే నిజమైన ప్రగతి అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను మంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. స్వచ్ఛమైన కూరగాయలు, మాంసం, పండ్లు, పూలు ప్రజలకు అందించి.. నాణ్యతా ప్రమాణాలు పాటించి సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈసందర్భంగా జాతీయస్థాయిలో గుర్తింపు పొందడంపై మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంచందర్‌రావు, డైరెక్టర్లు శ్రీనివాస్, మోహిజ్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జక్కపూర్ గ్రామ ప్రజల పక్షాన వివిధ కుల సంఘాల ప్రతినిధులు మంత్రి హరీశ్‌రావుకు బీఆర్ఎస్ కోసం రూ. లక్ష విరాళం అందించారు.

చేపలపై హక్కు కల్పించాలి

దుబ్బాకటౌన్: మల్లన్నసాగర్ ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు ముంపు బాధిత గ్రామాల మత్స్యకారులకు హక్కు కల్పించాలని పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఎమ్మెల్యే రఘునందన్‌రావు విన్నవించారు. శనివారం హైదరాబాద్‌లో ఈమేరకు కలిసి వినతి పత్రం అందజేశారు. మల్లన్నసాగర్ నిర్మాణంతో దుబ్బాక నియోజకవర్గం తొగుట మండలంలోని 8 గ్రామాలతో పాటు వాటికి సంబంధించిన మత్స్య సొసైటీలు, 74 చెరువులు మునిగిపోయాయన్నారు. దీంతో సభ్యత్వం ఉన్న 640 మంది మత్స్యకారులతో పాటు మరో 2,400 మంది సభ్యత్వం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని మంత్రికి వివరించారు. ప్రాజెక్టు పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా బాధిత మత్స్య సొసైటీలకు అవకాశం కల్పించకపోవడం సరికాదన్నారు. తొగుట మండలంలోని అన్ని గ్రామలకు సొసైటీలు ఏర్పాటు చేసి ప్రాజెక్టులో చేప పిల్లలు వేసి సర్వహక్కులు కల్పించాలని కోరారు.



మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

బర్నింగ్ డిజైర్‌తో ముందుకు



మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేసి హై ప్రొఫైల్ ఇంటర్వ్యూలు చేయాలనేది ఆ విద్యార్థిని లక్ష్యం. డిగ్రీ పట్టా అందుకోకుండానే ఏకంగా ప్రధాని మోదీని కలిసే అవకాశం నెహ్రూ యువకేంద్రం (కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ) ద్వారా దక్కించుకుంది. సిద్దిపేట నుంచి ఢిల్లీలో ప్రధానిని కలిసే వరకు సాగిన ప్రయాణం గురించి శనివారం 'సాక్షి' బండవరం శ్రీవర్షిణిని పలకరించింది. ఆమె మాటల్లోనే..

- సాక్షి, సిద్దిపేట

- ఢిల్లీ టూర్‌లో ఎంతో నేర్చుకున్నా..
- ప్రధానిని ఇంటర్వ్యూ చేయడమే నా లక్ష్యం
- 'సాక్షి'తో విద్యార్థిని శ్రీవర్షిణి

అలా మొదలైంది..

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్నా. తొలుత జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతగా నిలిచా. ఆ వెంటనే ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లోనూ ప్రథమ స్థానం సాధించా. దీంతో జాతీయస్థాయికి ఎంపిక చేశారు. జాతీయ స్థాయిలో పోటీలకు ఉపన్యాసానికి సంబంధించిన వీడియోను పంపించా. అది నచ్చి రాష్ట్రం తరఫున ప్రధానమంత్రి మోదీతో కలిసే అవకాశం కల్పించారు. జనవరి 23వ తేదీన పార్లమెంట్‌లో జరిగిన సుభాశ్ చంద్రబోస్ లైఫ్ అండ్ లెగసీ ఇన్ అమృత్‌కాల్‌లో భాగంగా ఆయనతో ముచ్చటించే అవకాశం లభించింది.

ఆయన స్ఫూర్తితోనే..

సుభాశ్ చంద్రబోస్ జీవిత చరిత్రను ఎవరైనా చదివారా అని మోదీ ప్రశ్నించారు. అప్పుడు నేను హ్యాండ్ రైజ్ చేశాను. 'ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడే సుభాశ్ చంద్రబోస్ గురించి చదివాను. ఆయన స్ఫూర్తితోనే ఫైర్, బర్నింగ్ డిజైర్‌తో ముందుకు వెళ్తున్నా' అని చెప్పా. అనంతరం ప్రధాని మోదీతో గ్రూప్ ఫొటో దిగాం. ఆ తర్వాత 24, 25న ఢిల్లీలో స్వచ్ఛ భారత్ గురించి తెలుసుకున్నా. పీఎం సంగ్రహాలయ్‌తో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నా. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా పరేడ్‌లో పాల్గొనడం కొత్త అనుభూతిని ఇచ్చింది. 27న సిద్దిపేటకు చేరుకున్నా.

అందరూ నాకంటే పెద్దవారే..

ఢిల్లీ టూర్‌లో దేశంలోని ఇరవై ఏడు రాష్ట్రాల సంస్కృతి, ఆహారపు అలవాట్లు, వారి హెరిటేజ్ గురించి తెలుసుకున్నా. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ నాకంటే పెద్దవారే. ఎన్నో విషయాలను నాతో పంచుకున్నారు. ఈ నాలుగు రోజుల్లో మన దేశంలో ఉన్న డైవర్సిటీ అందులో ఇమిడి ఉన్న యూనిటీని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించా. అక్కడికి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నా. అలాగే లోకసభ స్పీకర్ ఓం బిర్లాతో ఆటోగ్రాఫ్ తీసుకున్నా.

కొత్త ఫ్రెండ్ దొరికింది

రాజస్థాన్‌కు చెందిన జాన్ని స్నేహితురాలు అయింది. తనూ నేను ఇద్దరం క్లోజ్‌గా ఉన్నాం. తనను మా ఇంటికి ఆహ్వానించాను. జాన్ని నాకు ఓ చిరు కానుకగా సిల్వర్ చైన్ విత్ పెండెంట్‌ను ఇచ్చింది. ప్రధాని మోదీని కలవడం అదృష్టంగా భావిస్తున్నా. ఆయనను రిపోర్టర్‌గా కలిసి ఇంటర్వ్యూ చేయడమనేది నా కల. ఎన్‌వైకే ద్వారా నాకు కలిసే అవకాశం వచ్చింది.

అందరికీ థ్యాంక్స్..

పదో తరగతి వరకు మెరిడీయన్ స్కూల్, ఇంటర్ గురుకృపలో చదివాను. తల్లిదండ్రులు వేణుమాధవ్, నాగలక్ష్మి. నాన్న బిజినెస్.. అమ్మ కేజీబీవీలో అధ్యాపకురాలిగా పని చేస్తోంది. చెల్లెలు సౌదామిని మూడో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచి నాకు చదువు చెప్పిన టీచర్లకు, కళాశాల అధ్యాపకులకు, ఎన్‌వైకే వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. శనివారం కళాశాల అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించారు. మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



ప్రధాని మోదీతో శ్రీవర్షిణి (వృత్తంలో)

వర్టికల్ వారీగా విధులు నిర్వర్తించాలి

పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: వర్టికల్ వారీగా విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. శనివారం నూతనంగా ఆధునీకరించిన సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌ను అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌తో కలిసి సందర్శించారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ దేవారెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ కార్యాలయంలో మారథాన్ ఆఫ్ మారథాన్ రన్నింగ్ ప్రాక్టీస్ అథ్లెటిక్ కోచ్ నిరంజన్, పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. కోచ్ నిరంజన్ రన్నింగ్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న 108 జిల్లా కోఆర్డినేటర్ కుమార స్వామి

దుబ్బాక: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందించాలని 108 అంబులెన్స్ సిబ్బందికి 108 జిల్లా కోఆర్డినేటర్ కుమార స్వామి సూచించారు. శనివారం నాడు దౌల్తాబాద్ మండల కేంద్రంలోగల 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అత్యవసర సమయంలో చేసిన సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

హద్దు రాళ్ల తొలగింపు



హద్దురాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిద్దిపేటజోన్: చెరువు శిఖంలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు, ఫిర్యాదు నేపథ్యంలో మున్సిపల్ అధికారులు శనివారం హద్దురాళ్లను తొలగించారు. స్థానిక ఎర్ర చెరువు శివారులో గుర్తు తెలియని వ్యక్తులు చెరువు శిఖం భూమి కబ్జా చేస్తున్నారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సోషల్ మీడియాలో ఆరోపణలు చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది హద్దురాళ్లను తొలగించారు.

ఏఎస్పీడీఓపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

సిద్దిపేటరూరల్: జాతీయ జెండాను అగౌరవపరచిన సిద్దిపేట పరిధి ఏఎస్పీడీఓ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా ఆఫీసులో మల్లేశం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ జెండా పూర్తిగా మాసిపోయింది ఎందుకు ఆవిష్కరించారని ప్రశ్నించగా జెండా ఎలా ఉంటే ఏంటి, హాస్టల్ తనకు ముఖ్యమని దురుసుగా బదులిచ్చారన్నారు. కొత్త జెండాను ఆవిష్కరించాల్సిన అధికారి మాసిపోయిన, చిరిగిపోయిన జెండా ఎగురవేయడం జెండా ఆవిష్కరణ నియమాలకు విరుద్ధమన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణపై అనుచితంగా మాట్లాడిన అధికారి మల్లేశంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి చెప్యాల సంతోశ్ తదితరులు ఉన్నారు.

రైతును వేధిస్తున్న 'మొగిపురుగు'

- వరి పంటను ఆశిస్తున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- సమాచారం ఇవ్వాలంటున్న అధికారులు



జిన్నారంలో మొగిపురుగు ఆశించి పాడైన వరి పంట

జిన్నారం(పటాన్‌చెరు): రైతులకు మొగిపురుగు (కాండం తొలిచే పురుగు)ఓ శాపంలా మారింది. ప్రస్తుతం వరి పంటకు అధికంగా మొగి పురుగు ఆశిస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేప ట్టారు.

- జిన్నారం మండలంలో 2500 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో 1600 మంది వరినాట్లు వేశారు.
- గుమ్మడిదల మండలంలో 4 వేల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ప్రస్తుత సీజన్‌లో 2500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.
- రైతులు వరి నాట్లను వేసి పదిరోజులు గడిచింది. ప్రస్తుతం వరి పంటకు అధికంగా మొగిపురుగు ఆశిస్తోంది.
- వరి పైరు ఎర్రగా మారుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.
- ఈ సమస్యను పరిష్కరించేలా వ్యవసాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

కారణాలు

- పంట మార్పిడి లేకపోవటం వల్ల పంటలకు వ్యాధులు సోకుతున్నాయి.
- ప్రస్తుత వాతావరణ మార్పులు కూడా ఈ పురుగు ఆశించడమే కారణం.
- నారుమడి(తుకం)పై భాగాన్ని తుంచాల్సి ఉంటుంది. సస్యరక్షణ చేపట్టకుండా యూరియా వినియోగిస్తుండటంతో పురుగు నియంత్రణ కష్టమవుతోంది.

నివారణకు వాడాల్సి మందులు:

- మొగిపురుగు నివారణకు వ్యవసాయశాఖ అధికారులు సూచించిన మందులను వాడాల్సి ఉంటుంది.
- ఎకరాకు 8 కేజీలు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు వాడాల్సి ఉంటుంది. లేదా ఎకరాకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 జీ గుళికలను పిచికారీ చేయాలి.
- వరి నారుమడిలో నారు తీసేటప్పుడు గంట ముందు కిలో 4జీ గుళికలు వాడుకోవాలి.
- జింకు లోపాన్ని గుర్తిస్తే 2 కిలోల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మొగిపురుగుతో ఇబ్బందులు పడుతున్నాం

మొగిపురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వివిధ రకాల మందులు పంటకు పిచికారీ చేస్తున్నాం. పంటకు పురుగు సోకకుండా ఉండేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– బ్రహ్మేందర్, జిన్నారం రైతు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వరి పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. మొగి పురుగు సోకితే రైతులు మాకు సమాచారం తెలిపాలి. మేము సూచించిన మందులు వాడుతుంటే పురుగును నివారించవచ్చు. ఎలాంటి సందేహాలు ఉన్నా మమ్మల్ని సంప్రదించాలి.

– రవీంద్రనాథ్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి, జిన్నారం

గంజాయి బ్యాచ్ అరాచకాల వార్తలో నిజం లేదు

హుస్నాబాద్: ఇరువర్గాల గొడవను గంజాయి బ్యాచ్ అరాచకాలుగా ఫేక్ న్యూస్ సృష్టించి వాట్సాప్‌లలో పంపిస్తున్నారని, గంజాయి బ్యాచ్ ఆగడాలు వార్తలో నిజం లేదని ఎస్ఐ శ్రీధర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం ఇల్లందుల మల్లయ్య, ఆయన తోడల్లుడు ఎలకంటి రాము కారులో వెళ్తున్నారు. ఫ్రండ్స్‌మార్ట్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హీనాలవ్ రోడ్డు దాటుతున్నాడు. వేగంగా వస్తున్న కారును చూసి నిదానంగా వెళ్లాలని దురుసుగా చెప్పడంతో ఇరువురు గొడవపడ్డారు. వెంటనే హీనాలవ్ తన స్నేహితులు హమ్మర్, హుస్సేన్, అదావ్‌కు ఫోన్ చేసి సంఘటనా స్థలానికి రావాలన్నాడు. అందరూ కలిసి దాడి చేయడంతో మల్లయ్య గాయపడ్డాడు. తనపై నలుగురు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ విషయంలో ఎవరూ గంజాయి సేవించలేదని, గంజాయి బ్యాచ్ అరాచకాలని తప్పుడు వార్త సృష్టించి వైరల్ చేయడం మంచిది కాదన్నారు. ప్రజలు ఇటువంటి వార్తలను నమ్మవద్దని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్డుపై కారు టైరు మారుస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీ
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు
- చికిత్స కోసం ఆస్పత్రులకు తరలింపు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

పటాన్‌చెరుటౌన్: కారు టైరు మారుస్తుండగా వెనుక నుంచి ఓ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కొంపల్లికి చెందిన ప్రదీప్ గోయాంక(64) శనివారం తెల్లవారుజామున ఎల్బీనగర్ నుంచి మేడ్చల్‌కు చింతల్‌కు చెందిన డ్రైవర్ ఓం ప్రకాశ్‌తో కలిసి కారులో బయలుదేరాడు. దారి తెలియక డ్రైవర్ పటాన్‌చెరు మండల పరిధి పోచారం సమీప రింగ్ రోడ్డులో కారు వేగం తగ్గించాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం కారును ఢీకొట్టడంతో కారు టైర్ బ్లాస్ట్ అయ్యింది. దీంతో డీసీఎం డ్రైవర్ మోతీరామ్ వాహనాన్ని పక్కన నిలిపి, కారు వద్దకు వచ్చాడు. కారు డ్రైవర్ ఓం ప్రకాష్, డీసీఎం డ్రైవర్ మోతీరామ్ కారు టైరు మారుస్తున్నారు. ప్రదీప్ గోయాంక రహదారిపై నిలబడి చూస్తున్నాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం అతడిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందగా ఓంప్రకాశ్, మోతీరామ్ గాయపడ్డారు. చికిత్స కోసం ఓంప్రకాష్‌ను సనత్ నగర్ ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించగా, మోతీరామ్‌ను యశోద ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మోతీరామ్ స్వస్థలం సిద్దిపేట జిల్లా అక్కపేటగా గుర్తించారు.

లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రిన్సిపాల్‌కు పంచాయతీ కాపీ అందజేత



పంచాయతీ కాపీ అందజేస్తున్న సర్పంచ్

కొండపాక(గజ్వేల్): కాలేజీ విద్యార్థినులపట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌పై కఠిన చర్యలు తీసుకుని, కళాశాల నుంచి బదిలీ చేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ చిట్టి మాధురీరెడ్డి శనివారం ప్రిన్సిపాల్ ఇందిరాదేవికి గ్రామ పంచాయతీ తీర్మాన కాపీని అందజేశారు. కొండపాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యానులపట్ల లెక్చరర్ తీరు పాఠకులకు విధితమే. మరోమారు ఇలాంటి సంఘటనలు జరగకుండా అతడిని బదిలీ చేయడంతో పాటు సహకరించిన ఇతర లెక్చరర్‌లపై సైతం కఠిన చర్యలు తీసుకోవాలని కాపీలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాధురిరెడ్డి మాట్లాడుతూ దేవాలయం లాంటి కళాశాలకు చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తించడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కళాశాలపై నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



ఖాజామియా మృతదేహం

కోహీర్(జహీరాబాద్): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన కోహీర్ శివారులో శనివారం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఖాజామియా కర్ణాటక రాష్ట్రం బీదర్ నివాసి. కొంత కాలంగా కోహీర్‌లో ఉంటున్నాడు. జీవనోపాధి కోసం పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఉదయం పశువులను తోలుకొని వెళ్లిన ఖాజామియా కోహీర్, పోతిరెడ్డిపల్లి రైల్వే క్రాసింగ్ సమీపంలో రైలుకింద పడి మరణించాడు. రైలు ఢీకొనడంతో తల గుర్తుపట్టని రీతిలో నుజ్జు అయింది. సుమారు 50 మీటర్ల దూరం వరకు మృతదేహాన్ని ఈడ్చుకుపోయింది. పశువులను తోలే క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొందా లేక తానే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ..

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ ఈత్వార్‌పేటకు చెందిన బిపాష (45) శనివారం ఇంట్లో పనిచేస్తోంది. విద్యుత్ వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడింది. కుటుంబీకులు ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు..



నాగరాజు (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడటంతో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన రంగాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన దానప్ప నాగరాజు (35) వారం క్రితం వర్గల్ మండలం అంతగిరిపల్లిలో పొలం దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

తూప్రాన్: హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గొడుగు నరేశ్(28) ఈనెల 21వ తేదీన కనిపించకుండా పోయినట్లు భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నరేశ్ స్నేహితులు ఆబోతు మల్లేశ్, తిప్పాపూర్‌కు చెందిన హమీద్ అలియాస్ నవీన్‌ను అనుమానంతో విచారించారు. మహిళలతో సన్నిహితంగా ఉంటున్నాడని నరేశ్‌పై కక్ష పెంచుకున్నారు. ఎలాగైనా అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు పట్టణానికి చెంది న పర్శ మల్లేశ్ సహాయం తీసుకున్నారు. నరేశ్ తో కలిసి పట్టణ సమీప గడ్డమోలా బండవద్ద మద్యం తాగారు. పథకం ప్రకారం నరేశ్‌ను హత్య చేశారు. అనంతరం సమీపంలోని పాడుబడిన బావిలో మృతదేహాన్ని, అతడి బైక్‌ను పడేశారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోశాలలో కోడెల మృతి

చేగుంట(తూప్రాన్): అక్రమంగా తరలిస్తూ సిద్దిపేటలో పట్టుబడిన పశువులను మాసాయిపేట గోశాలకు తరలించగా వాటిలో మూడు కోడెలు శనివారం సాయంత్రం మృతి చెందాయి. అక్రమంగా తరలిస్తుండగా 43 పశువులను సీపీ శ్వేత మాసాయిపేట గోశాలకు తరలించారు. ఇందులో మరో పది పశువులు అనారోగ్యానికి గురయ్యాయి. అనారోగ్యంతో ఉన్న పశువులకు స్థానిక పశువైద్యాధికారి కావ్య చికిత్స నిర్వహిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



నర్సింలు మృతదేహం

నిజాంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన వడ్డే నర్సింలు(38) రెండు నెలల క్రితం వచ్చి మండలంలోని తిప్పన్నగుల్ల గ్రామంలోని శౌకత్‌పల్లి జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం చేపల వేటకు తిప్పన్నగుల్ల గ్రామంలో ఐదర్‌చెరువు వెళ్లాడు. వేటకు వెళ్లి ఎంతసేపైనా రాకపోవడంతో అతడి భార్య లక్ష్మి చెరువు వద్ద వెళ్లి వెతికింది. అక్కడ చెప్పులు, బట్టలు కనబడటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులతో కలిసి వెతకడంతో మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పెయింటర్ ఆత్మహత్య

హుస్నాబాద్: పట్టణానికి చెందిన పెయింటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం పట్టణ శివారులోని మహ్మదాపూర్ రహదారి సమీప మామిడి తోటలోని చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న గడ్డం ప్రవీణ్ (22) పట్టణంలోని కేబీ కాలనీ వాసిగా గుర్తించారు. మృతుడు పెయింటింగ్ పని చేస్తుంటాడని స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఈజీఎస్ పనులు భేష్

జాతీయ ప్రజా పర్యవేక్షణ బృందం



కేంద్ర బృందానికి స్వాగతం పలుకుతున్న తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్, తుక్కాపూర్ గ్రామాల్లో చేపట్టిన ఎస్ఆర్ఈజీఎస్ పనులను జాతీయ ప్రజా పర్యవేక్షణ బృందం శనివారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు, పెన్షన్ దారులు, మహిళా సంఘం సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాలు, గ్రామ పంచాయతీ కల్పిస్తున్న వసతుల గురించి ఆరాతీశారు. బృందం సభ్యుడు జోయల్ జోషెష్ మాట్లాడుతూ కాన్గల్, తుక్కాపూర్ పంచాయతీలలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పథకాలు బాగా అమలువుతన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సభ్యులు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ప్రేమల చంద్రారెడ్డి, చిక్కుడు చంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, ఉప సర్పంచ్‌లు శ్రీలత స్వామి, మల్లయ్య, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఈఓ చందన, ఐకేపీ ఏపీఎం మగ్దూం అలీ, ఏపీఎం కిషన్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పని ఇప్పిస్తానని చెప్పి..

- మహిళకు మద్యం తాగించి
- నగలతో ఉడాయించిన కిలేడీ అరెస్ట్
- నాచారం టెంపుల్ వద్ద ఘటన

వర్గల్(గజ్వేల్): పని ఇప్పిస్తానని చెప్పి మహిళకు మద్యం తాగించి ఆమె మెడలోని బంగారు నగలు అపహరించుకుపోయిన కిలాడి చివరకు కటకటాల పాలైంది. ఈఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట వద్ద జరిగింది. వర్గల్ మండలం గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగుకు చెందిన మేకల శారద(41) కూలి పనులు చేస్తోంది. ఆమె వద్దకు ఈనెల 24వ తేదీన గుర్తుతెలియని మహిళ వచ్చి సిద్దిపేట జిల్లా నాచారం గుట్ట వద్ద ఫంక్షన్ ఉందని, కూరగాయలు తరిగేందుకు ఆడ పనిమనిషి కావాలని, సరైన కూలీ ఇస్తానని నమ్మించి తనవెంట ఆటోలో నాచారం గుట్టకు తీసుకొచ్చింది. అక్కడ వైన్స్ దగ్గర మందు తాగించింది. నిద్ర మత్తులోకి జారుకున్న బాధితురాలు మేకల శారద మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడు, పావుతులం చెవికమ్మలు తీసుకుని ఉడాయించింది. శారదకు మెలకువ వచ్చి చూసుకుంటే తన పుస్తెలతాడు, చెవికమ్మలు కనిపించకపోవడంతో లబోదిబోమన్నది. వెంటనే గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలో కనపడిన మహిళను బాధితురాలికి చూపించారు. ఆ మహిళ గతంలోనూ గౌరారం పీఎస్ పరిధిలో ఇదే తరహా చోరీకి పాల్పడిన మేడ్చల్-రంగారెడ్డి జిల్లా గాజుల రామారానికి చెందిన కైరంకొండ లక్ష్మీసంతోషి(38)గా గుర్తించారు. శనివారం నాచారం గుట్ట వద్ద నిందితురాలు లక్ష్మీ సంతోషి అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

అంత్యక్రియలకు హాజరై తిరిగి వెళ్తూ..

- చెట్టుకు ఢీకొట్టిన బైక్
- ఒకరు మృతి, మరొకరి తీవ్ర గాయాలు



చెట్టును ఢీకొన్న బైక్ (ఇన్ సెట్లో) మృతి చెందిన నర్సింలు

కొల్చారం(నర్సాపూర్): బంధువు అంత్యక్రియలకు హాజరై బైక్‌పై తిరిగి వెళ్తూ చెట్టును ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొల్చారం మండలం రంగంపేట గ్రామ శివారులోని మెదక్-జోగిపేట ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కొల్చారం ఏఎస్ఐ తారాసింగ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మృతుడు మంగలి నర్సింలు(38), ఎనగండ్ల గ్రామానికి చెందిన బంధువు మంగలి లింగంతో కలిసి బైక్‌పై మండంలోని తుక్కాపూర్‌కు బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం ఇద్దరూ కలిసి అదే బైక్‌పై ఎనగండ్ల గ్రామానికి ప్రయాణమయ్యారు. బైక్ అదుపు తప్పడంతో గంగంపేట శివారు ప్రధాన రహదారి పక్క మర్రి చెట్టుకు ఢీ కొట్టడంతో నర్సింలు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ప్రైవేటు అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మెదక్ ఆస్పత్రిలో లింగం చికిత్స పొందుతున్నాడు. మృతుడు నర్సింలుకు భార్య యశోద, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

ఆటో బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు



గాయపడినవారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎదురెదురుగా బైక్, ఆటో ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లింగుపల్లి గ్రామానికి చెందిన జోగ్యారి నర్సింహులు శనివారం తన పొలానికి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి మిరుదొడ్డికి వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న లింగుపల్లి గ్రామానికి చెందిన ముత్యాలు, అమృత, నర్సింహులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కాగా నియోజకర్గ పర్యటనలో భాగంగా అటుగా వెళుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు తన కారును ఆపి సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, స్థానికుల సహాయంతో గాయపడ్డ ముగ్గురిని అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని మెరుగైన వైద్యం అందించాలని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి చెప్పారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ఈశ్వరయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాశ్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నంకరంపేటకు చెందిన వడ్డె ఈశ్వరయ్య(45) టీవీఎస్‌పై పొలానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అంబాజీపేట బ్రిడ్జి వద్ద మెదక్ నుంచి వస్తున్న కారు ఢీ కొనడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన కారు యజమాని సాయిలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స కోసం తరలిస్తుండగా ..



పోచయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన మంగలి పోచయ్య (44) వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 26వ తేదీ రాత్రి బంధువు పండరితో కలిసి బైక్‌పై కూరగాయల కోసం మండలంలోని ఎన్కెపల్లికి బయలు దేరాడు. ఈ క్రమంలో రంగంపేట నుంచి పాపన్నపేట వస్తున్న మరో బైక్ ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో పోచయ్య, పండరీ కిందపడటంతో గాయపడ్డారు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలికి చేరుకుని పోచయ్యను చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెదక్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం శుక్రవారం రాత్రి గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పోచయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లైటింగ్ పోల్‌ను ఢీకొన్న టిప్పర్

డ్రైవర్‌కు తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రుడిని నిమ్స్‌కు తరలిస్తున్న 108 సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: రహదారి మధ్యలో ఉన్న లైటింగ్ పోల్‌ను టిప్పర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పోచారం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వెళ్తున్న టిప్పర్ లారీ శనివారం తెల్లవారుజామున పోచారం సమీపంలోని రహదారి మధ్యలో ఉన్న లైటింగ్ పోల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో డ్రైవర్ సహనవాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలిసుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.